# విచిత్రప్రేమకలాపం

యమ్ వి యన్ సత్యనారాయణరావుగారు

"ఇవాళ నా డైరీలో ఓగొప్పవిషయం ఎక్కుతుంది" మిత్రబృందంతో ఈ మాట చెప్పొద్దనుకుంటూనే చెప్పేశాడు సత్యం

వడ్లగింజలో ఉండేది బియ్యపుగింజే ఐనా అది తెలియనివాడికి తెలుసుకోవాలనే ఉత్సాహం మోస్తరుగా స్నేహితులంతా ఏకకంఠంతో 'యేమిటా విషయం' అనటం తప్పలేదు.

అదేదో ఆ గొప్పవిషయం తెలుసుకోకుండా ఉండటం సత్యం స్నేహితులకుచేతగానిపని. చెప్పకుండా వుండటంకూడా సత్యానికి మించినపనే.

ఎంతోకాలంనుంచీ దాచిన రహస్యాన్ని తప్పనిసరిగా బైటపెట్టవలసివచ్చినప్పుడు పడేబాధకంటే ఎక్కువగానే బాధపడ్డాడు. కాని ఆ విషయం చెప్తేనే గానీ తన గొప్పతనానికి విలువకట్టరనేసంగతి గ్రహించక పోలేదు. ఐతే యే విధంగా మొదలుపెడితే బాగుంటుందా అని ఆలోచించాడు కొన్నేపు.

'నాకుజరిగిన ఈ అనుభవం సామాన్యంగా అందరికీ జరిగేదే కాని ఎక్కడో అక్కడ కొంత తేడా ఉండకపోదు" అని ఓచిన్న ఉపోద్ఘాతంతో విషయక్రమంలోకి దిగాడు.

"ఓ నాడు మధ్యాహ్నం కిటికీదగ్గరగా కూర్చుని చదువుకుంటున్నాను. ఆ విధంగా చదువుకుంటూ ఉంటే యేమయిందో తెలుసా"

"ఆ ప్రశ్న దేనికీ. చెప్తూ మమ్మల్ని చంపక"

"అదే, అదే, చెప్తా వినండి. ఎండ-అంటే సూర్యుని తాలూకు ఓ కిరణం నా పుస్తకంమీద పడింది."

"యేడ్చినట్టేవుంది. అందులో యేం విశేషం ఉందీ-పుస్తకంమీద యేచూరులోంచో ఎండపడటంకూడా డైరీలో ఎక్కించే విషయమైతే ఎన్నివాల్యూములు చాల్తాయిరా నీకూ ?' అన్నాడు ఒకమిత్రుడు ఎగతాళిగా

"అదికాదురా దద్దమ్మా! ఆ ఎండ మామూలుగ యేచూరులోంచో పడలేదు. ఆ ఎండ, అంటే ఆ కిరణం ఓ అద్దంద్వారా ప్రయాణంచేసి నా పుస్తకం మీద పడింది. ఆశ్చర్యచకితుడనై పోయి ఆకిరణం వచ్చేదిక్కుగా పరికించాను. అద్దాన్ని అనేక కోణాల్లో తిప్పుతూ వయ్యారం వొలకబోస్తూ, జడ వేసుకుంటూన్న పక్కింటి వాళ్ళమ్మాయి కనపడింది" అని ఆగాడు తను చెప్పవలసిన దాంట్లో ఒకభాగం ఐనట్టు.

"ఐతే ఇంతకీ ఆ అమ్మాయి ప్రియపూర్వకంగానే వేసిందంటావా ఫోకస్ నీ మీదకి", ఉత్సాహాన్ని చూపిస్తూ అన్నాడు మరోమిత్రుడు.

చిరునవ్వు నవ్వి "మరి లేకపోతే చెప్ప కోవలసిన విషయమేమిటీ"

"ఈ-ప్రణయం సాగించావన్నమాట ఇంకేం"

"లేదులే. అంతపని చేయలేదులే"

"మరియేంచేశావు చెప్దూ'

"కొంచం అయిద్దుంచూపా!'

"గొప్ప ఘనకార్యం చేశావు"

"చెప్పేదివిను-తర్వాతమళ్ళా నేను కిటికీదగ్గర ఆలాగే తలవంచుకుని చదువుకుంటూంటే యేదో కాగితం ఉండ నామీద పడింది. విప్పిచదివా"

"యేముంది అందులో"

"ఇదిగో ఆ కాగితం"

ఒక మిత్రుడు తీసుకుని చదవటం ప్రారంభించారు.

"మిమ్మల్ని చూడగానే నాలో యేవో అవ్యాజమైన ప్రేమానురాగాలు పుట్టుకొచ్చి ఎంతోకాలంగా నాలో దాచుకున్న రహస్యాన్ని ఇంకా దాచుకుని ప్రయోజనం లేదని గ్రహించి వీలైనంత త్వరలో నన్ను కలుసుకోవాలని మరీ మరీ కోరుతున్నాను"

"దానికి రిప్లయి యేంరాశావు"

"అదే ఇంకా యేం రాయలేదు"

"ఐతే తక్షణం రాసేయ్ కలుసుకుంటానని" మిత్రులంతా యేక కంఠంతో అన్నారు.